ప్రజల మాట ప్రగతి బాట

# సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గం

## బ్యాంక్ పథకాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

దహెగాం, అక్టోబర్ 27 : బ్యాంక్ పథకాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని టీజీబీ మేనేజర్ నవీన్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంతో పాటు కమ్మర్‌పల్లి గ్రామంలో ఫోక్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ కళాజాత వారిచే బ్యాంక్ పథకాలు, స్కీంలపై శుక్రవారం అవగాహన కల్పించారు. మహిళల పొదుపు, ఎడ్యుకేషన్, హౌజింగ్, వాహన, గోల్డ్‌లోన్‌తో పాటు సామాజిక భద్రత పథకాలు, ప్రధాన మంత్రి సురక్ష యోజనా బీమా, తదిత వాటిని వివరించారు. కార్యక్రమంలో కళాజాతా బృందం సభ్యులు చిరంజీవి, మెజీషియన్ విష్ణు, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

## బకాయిలు చెల్లించాలి

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, అక్టోబర్ 27: విద్యుత్ బకాయిలు చెల్లించాలని టౌన్ ఏఈ కమలాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌తో పాటు బకాయిలు వసూలు చేసేందుకు స్పెషల్ అధికారులు, సిబ్బంది తిరుగుతున్నారని తెలిపారు. బకాయిలు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు.

## నేవీలో ఉద్యోగం



రాకేశ్

పెంచికల్‌పేట్, అక్టోబర్ 27 : మండలంలోని ఎల్కపల్లికి చెందిన దుబ్బుల రమేశ్ శంకరమ్మ దంపతుల రెండో కుమారుడు రాకేశ్ నేవీలో ఉద్యోగం సాధించాడు. తల్లి గృహిణి కాగా తండ్రి చిన్న కిరాణం నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రాకేశ్ పదో తరగతి వరకు మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. బెజ్జూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసి, హైదరాబాద్‌లోని డిగ్రీ ప్రభుత్వ సిటీ కాలేజీలో మ్యాథమెటిక్స్ ఫైనలియర్ చదువుతున్నాడు. కుమారుడిని చూసి తల్లిదండ్రులు గర్వపడుతూ స్వీట్లు తినిపించారు. యువకుడిని మండల ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

## వైద్యం వికటించి బాలింత మృతి



పుష్పలత (ఫైల్)

చింతలమానేపల్లి, అక్టోబర్ 27: ఆర్‌ఎంపీ వైద్యం వికటించి బాలింత మృతి చెందిన ఘటన కోర్సిని గ్రామంలో జరిగింది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దస్సురి పుష్పలత (24) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నది. దీంతో గురువారం సాయంత్రం బూరెపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ గణేశ్ వచ్చి రక్త నమూనా తీసుకొని పరీక్షలు చేసి వైద్యం అందించాడు. గురువారం రాత్రి సెలైన్ పెట్టి ఇంజక్షన్ వేయగా కొద్ది సేపటికే పుష్పలత ఒక్కసారిగా అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆర్ఎంపీకి ఫోన్ చేయగా స్పందించకపోవడంతో హుటాహుటినా కౌటాల దవాఖానకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు. ఆర్ఎంపీ ఎక్కువ మోతాదులో ఇంజక్షన్, మందులు ఇవ్వడంతోనే బాలింత మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలని భర్త ప్రసాద్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ఆర్ఎంపీని కస్టడీలోకి తీసుకున్నట్లు తెలిపారు. మృతురాలుకు రెండేళ్ల కూతురు శివానీ, మూడు నెలల శిశువు అక్షిత ఉన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

కౌటాల, అక్టోబర్ 27 : మండలంలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం ఊపందుకున్నది. ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు మద్దతుగా గ్రామాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నారు. కారు గుర్తుకు ఓటు వేసి కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల వేళ చాలామంది మాయ మాటలు చెబుతూ వస్తుంటారని వారి మాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వసంత్ రావు, యూత్ మండలాధ్యక్షుడు రవీందర్ గౌడ్ అన్నారు. ప్రచారం చేసిన వారిలో కౌటాల సర్పంచ్ మౌనిష్, ఉపసర్పంచ్ తిరుపతి, మొగడ్‌దగడ్ ఎంపీటీసీ మనీశ్, కో ఆప్షన్ సభ్యుడు అజ్మత్ అలీ, పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సంతోష్, నయీం, రాంచందర్, నాందేవ్, అశోక్, ముత్తయ్య, గోపాల్, ఏక్‌నాథ్, నాందేవ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



దహెగాం : మండలకేంద్రంలో ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేస్తున్న కోనేరు వంశీ

### చింతలమానేపల్లి మండలంలో..

చింతలమానేపల్లి, అక్టోబర్ 27: మండలవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని, అంతేగాకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. మరిన్ని అందాలంటే ఎమ్మెల్యే అభ్యర్థి కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

### ఎమ్మెల్యే కోనప్ప గెలవాలని పూజలు

మండలంలోని బాబాసాగర్ గ్రామంలో గల నాయికపువాడ ఎల్లారం పోచమ్మ ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనప్ప మళ్లీ గెలవాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో బండి మహేశ్, పిప్రే సురేశ్, నాగుల పెల్లి శంకర్, రవీందర్, కొండు లక్ష్మణ్, సందిర్ల నరేందర్, సదయ్య, చేకుర్తి తిరుపతి పాల్గొన్నారు.

### మర్తిడిలో ప్రచారం..

బెజ్జూర్, అక్టోబర్ 27 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించాలని మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్ కోరారు. మండలంలోని మర్తిడి గ్రామంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కేసీఆర్ భరోసా పథకాలు పింఛను రూ. 5 వేలకు పెంచడంతో పాటు తెల్ల రేషన్ కార్డు గల ప్రతి కుటుంబానికి బీమా సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధిని గమనిస్తూ మరింత అభివృద్ధి జరగాలంటే కారు గుర్తుకు ఓటేసి కోనేరు కోనప్పను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. బీఆర్ఎస్ నాయకులు ఈగ లక్ష్మీనారాయణ, అజీంఖాన్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

### దహెగాంలో కోనేరు వంశీ ఆధ్వర్యంలో..

దహెగాం, అక్టోబర్ 27 : మండలకేంద్రంలో ఎమ్మెల్యే తన తనయుడు కోనేరు వంశీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి వెళ్లిన శ్రేణులకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే కోనప్ప చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కన్వీనర్ కంభగౌని సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చౌదరి సురేశ్, సర్పంచ్‌లు పుప్పాల లక్ష్మి, బండ కృష్ణమూర్తి, అయిల్ల శంకర్, మాజీ ఎంపీపీ వాణిప్రసాద్, పార్టీ మండలాధ్యక్షుడు ప్రసాద రాజ్ తదితరులు పాల్గొన్నారు.



కౌటాల : కనికి గ్రామంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వసంత్ రావు



బెజ్జూర్ : మర్తిడిలో ప్రచారం చేస్తున్న కో-ఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్

# రైతు అవగాహన సదస్సు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, అక్టోబర్ 27 : మండలంలోని నజ్రుల్‌నగర్ గ్రామ రైతువేదికలో ఎక్స్టెన్షన్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్, ఎవర్ గ్రీన్ ఎనర్జీ ఎంటర్‌ప్రైజెస్ అధికారులు, నాబార్డ్ వారి ఆర్థిక సహకారంతో డిజిటల్ సేవలతో రైతుల లాభదాయకతను పెంపొందించే ప్రాజెక్టులో భాగంగా శుక్రవారం రైతు అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మొబైల్ అగ్రి సపోర్ట్ సర్వీసెస్ సేవలు అందించే వ్యాన్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రైతులకు మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్షల ఆవశ్యకత, వాతావరణ సం బంధిత సమాచార విస్తరణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు శాస్త్రవేత్తలతో చర్చించే సదుపాయం, వ్యవసాయంలో డ్రోన్ పద్ధతి వినియోగంపై అవగాహన, మార్కెటింగ్ సమాచార విస్తరణ పై శిక్షణ ఇచ్చారు. అధికారులు డా. ఎం జగన్ మోహన్ రెడ్డి, డా. డీ శిరీషా, ఈఈఐ హైదరాబాద్ సిబ్బంది, డా. ప్రసాద్ రావు, శ్రీనివాస్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి హనుమంతరావు, కృష్ణా రెడ్డి, ఏడీఏ మనోహర్, ఏవో రామకృష్ణ, కిసాన్ లింకు, నాబార్డ్ అధికారులు, 250 మంది రైతులు, ఇతర ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుడుంబా తరలిస్తున్న ఇద్దరిపై కేసు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 27 : పట్టణంలోని అండాలమ్మ కాలనీలో ద్విచక్ర వాహనాల ద్వారా గుడుంబా తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు మంచిర్యాల ఎక్సైజ్ సీఐ నరేందర్ రెడ్డి శుక్ర వారం తెలిపారు. మందమర్రి మండలం పులిమడుగుకు చెందిన బొల్లెన దినేష్, బొల్లెన రాకేష్‌లు ద్విచక్ర వాహనాల మీద 16 లీటర్ల గుడుంబాను మంచిర్యాలకు తరలిస్తుండగా అండాలమ్మ కాలని వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు సీఐ వెల్లడించారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై జీవన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి, సిబ్బంది ప్రసాద్, రాజేంద్రప్రసాద్, సరిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.